కల నిజమయ్యేదెప్పుడో..?

- డిగ్రీ కళాశాల మంజూరుపై నెరవేరని మంత్రి హామీ
- ఉన్నత చదువులకు దూరం
- మూడు దశాబ్దాలుగా ఎదురుచూపు
- మంజూరైతే నాలుగు మండలాల విద్యార్థులకు లబ్ధి
- రోడ్డెక్కుతున్న విద్యార్థులు
- పట్టించుకోని పాలకులు


ఎల్లారెడ్డిపేట: కళాశాల కోసం రోడ్డెక్కిన విద్యార్థులు (ఫైల్)

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చి ఐదేళ్లు గడిచినా ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. దీంతో దశాబ్దాలుగా ఉన్నత విద్యపై విద్యార్థులు కంటున్న కలలు కల్లలుగా మిగిలిపోయాయి. ఎంతోమంది విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారు. 2017లో మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీ ఇప్పటి వరకు నెరవేరకపోవడంతో విద్యార్థులు ఆందోళన బాట పట్టారు.

ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో నాలుగు ప్రభుత్వ, మూడు ప్రైవేటు జూనియర్ కళాశాలలున్నాయి. ప్రతి ఏడాదీ రెండు మండలాలకు చెందిన సుమారు వెయ్యి మంది విద్యార్థులు ఇంటర్ పూర్తి చేసుకున్నా ఉన్నత చదువులకు నోచుకోక గల్ఫ్ దేశాలకు వలసలు వెళ్తున్నారు. మరోవైపు ఉపాధి హామీ కూలీలుగా మారిపోతున్నారు. దీంతో ఉజ్వల భవిష్యత్తు ఉన్న విద్యార్థుల జీవితాలు అంధకారంగా మారుతున్నాయి. జిల్లాలో కేవలం రెండు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉండడంతో అనేక వ్యయప్రయాసాలకోర్చి పేద విద్యార్థులు చదువుకోలేకపోతున్నారు. కళాశాలను మంజూరు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు విద్యార్థులతో కలిసి అనేక రూపాల్లో ఉద్యమాలు చేస్తున్నారు. మంత్రి, ఎంపీ, స్థానిక నాయకులను అడ్డుకొని తమకు డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి కేటీఆర్ కళాశాల మంజూరు కోసం ఆరేళ్ల క్రితం హామీ ఇచ్చారు. ఇన్నేళ్ల వారి కల సాకారమవుతుందనే నమ్మకంతో పేద విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు ఇక ఉన్నత చదువులు చదువుతారనే ఆశలో ఉండగా ఇప్పటికీ కళాశాల ఏర్పాటు కాకపోవడంతో వారి ఆశలు అడియాసలయ్యాయి.

ఏటా వెయ్యిమంది ఇంటర్ పూర్తి

ఎల్లారెడ్డిపేట ఉమ్మడి మండల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలను కలుపుకోని ప్రతి ఏటా వెయ్యి మంది విద్యార్థులు ఇంటర్ విద్యను పూర్తి చేస్తున్నారు. ఒక్క ఎల్లారెడ్డిపేటలోనే మూడు ప్రభుత్వ, నాలుగు ప్రైవేట్ కళాశాలున్నాయి. ఈ కళాశాలల్లో చదువుతున్నే విద్యార్థులు ఇంటర్‌ను పూర్తి చేస్తున్నప్పటికీ ఆర్థిక స్తోమత లేక ఉన్నత చదువులు చదవలేకపోతున్నారు. ప్రైవేట్ కళాశాలల్లో ఫీజుల భారం మోయలేక మరోవైపు ప్రభుత్వ కళాశాల లేక మధ్యలోనే విద్యను నిలిపి వేయడంతో విద్యార్థులు ఉపాధి, భవన, వ్యవసాయ కూలీలుగా మారిపోతున్నారు. కొంతమంది విద్యార్థులు ఉన్నత చదువులు చదివే అవకాశం లేక గల్ఫ్ దేశాలకు వలస పోతున్నారు. ఇలాంటి దుర్భర పరిస్థితులతో ఎంతో భవిష్యత్తు ఉన్న విద్యార్థుల జీవితాలు అంధకారం అవుతున్నాయి. ప్రతిఏటా వెయ్యి మంది ఇంటర్ పూర్తి చేసినప్పటికీ అందులో సగానికి పైగా ఉన్నత చదువులు చదవలేకపోతున్నారు. ఈ రెండు మండలాల విద్యార్థులు సిరిసిల్ల, అగ్రహారం, గంభీరావుపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది.

మూడు దశాబ్దాలుగా ఎదురుచూపు..

డిగ్రీ కళాశాల కోసం విద్యార్థులు మూడు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నారు. కళాశాల కోసం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో అనేక సార్లు విద్యార్థులు రోడ్డెక్కి ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. మంత్రి కేటీఆర్‌తో పాటు అప్పటి ఎంపీ వినోద్‌కుమార్‌ల పర్యటనలో భాగంగా వారిని అడ్డుకోవడం, అరెస్టులు కావడం జరిగింది. మంత్రి ఇచ్చిన హామీని నిలబెట్టుకుని వెంటనే డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని ఏబీవీపీ నాయకులు గతంలో పోస్టుకార్డుల ద్వారా మంత్రిని కోరారు. ఆరేళ్ల క్రితం మంత్రి ఇచ్చిన హామీ కోసం విద్యార్థి సంఘాలు, విద్యార్థులు మళ్లీ రోడ్డెక్కి మంత్రి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతూ రాస్తారోకోలు, పోస్టుకార్డు ఉద్యమాలు చేస్తున్నారు. ఎల్లారెడ్డిపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరైతే నిరుపేద విద్యార్థులు ఉచితంగా ఉన్నత చదువులు చదివి ఉన్నత శిఖరాలకు చేరుకునే అవకాశం ఉంది. వెంటనే కళాశాలను మంజూరు చేసి పేద విద్యార్థుల ఇబ్బందులు తొలగించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

మంత్రి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



ఎల్లారెడ్డిపేటలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. నిరుపేద విద్యార్థులు పడుతున్న బాధలను గుర్తించి వెంటనే ఈ విద్యా సంవత్సరంలో కళాశాల మంజూరు చేయాలి. మంత్రి హామీ నేరవేర్చాలని కోరుతూ విద్యార్థులతో కలిసి పోస్టు కార్డుల ఉద్యమాన్ని కొనసాగిస్తున్నాం. కళాశాల మంజూరు చేసేంత వరకు ఉద్యమాలు చేస్తాం.

– మారవేణి రంజిత్‌కుమార్, ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్

సిద్దిపేటలో చదువుతున్నా



ఎల్లారెడ్డిపేటలో డిగ్రీ కళాశాల లేక వ్యయప్రయాసాలకు ఓర్చి సిద్దిపేటలో డిగ్రీ చదువుతున్నా. అనేక మంది ఆర్థిక ఇబ్బందులతో మధ్యలోనే చదువును మానేస్తున్నారు. కళాశాల కోసం విద్యార్థి సంఘాలతో కలిసి ఉద్యమాలు చేసిన ఫలితం లేకుండా పోయింది. నాతో పాటు ఇంటర్ చదువుకున్న అనేక మంది చదువును కొనసాగించలేకపోతున్నారు. కళాశాల ఉంటే ఉన్నత చదువులకు అవకాశం ఉంది.

– కాకర్ల రాకేశ్, విద్యార్థి

క్లుప్తంగా

పాఠశాలకు హద్దులు ఏర్పాటు చేయాలని వినతి


కలెక్టర్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న ఉపసర్పంచ్, గ్రామస్తులు

కోనరావుపేట: మండలం సుద్దాల పాఠశాల భూమికి హద్దులు ఏర్పాటు చేయాలని కోరుతూ ఉపసర్పంచ్ ఎరవెల్లి నాగరాజుతో పాటు గ్రామస్తులు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నెంబర్ 424లో గల స్థలంలో పాఠశాలకు చెందిన క్రీడాభూమి ఉందని, ఈ భూమికి హద్దులు లేకపోవడం వల్ల ఆక్రమణకు గురవుతుందన్నారు. ఇదివరకు రెవెన్యూ అధికారులకు విన్నవించగా అసంపూర్తిగా పనులు చేసి వెళ్లారని, హద్దులు లేక సమస్యలు ఏర్పడుతున్నాయని, పూర్తిస్థాయిలో సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని ఇచ్చారు. వారి వెంట పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ ఎరవెల్లి విజయ్‌కుమార్, ఉప్పుల ఆంజనేయులు పాల్గొన్నారు.

భాషాపండితులకు పదోన్నతులు ఇవ్వాలి

సిరిసిల్లకల్చరల్: ఉపాధ్యాయులు బదిలీలు పదోన్నతుల ప్రక్రియ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో భాషా పండితులకు కూడా పదోన్నతులు కల్పించాలని పండిత జేఏసీ, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు వినతిపత్రం అందించారు. అప్‌గ్రేడేషన్‌కు సంబంధించిన న్యాయ సమస్యలను త్వరగా పరిష్కరించి భాషా పండితులకు జరుగుతున్న అన్యాయాన్ని నివారించాలని కోరారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు బదిలీ, పదోన్నతులకు అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గోనె బాల్‌రెడ్డి, చైతన్యగౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు జనపాల వెంకటయ్య, కార్యదర్శి వెంకటయ్య, శ్రీనివాస్, వేణుమాధవ్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ మానస

తంగళ్లపల్లి: తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను సూచిస్తూ పార్టీ నాయకుడు అబుబకార్ ఆధ్వర్యంలో రూపొందించిన 2023 క్యాలెండర్‌ను ఎంపీపీ పడిగెల మానస సోమవారం ఆవిష్కరించారు. మండల కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ ఎగుమామిడి రమణారెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పడిగెల రాజు పాల్గొన్నారు.

నేతాజీకి నివాళి


ముస్తాబాద్: పోతుగల్‌లో నేతాజీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు


బోయినపల్లి: మోడల్ స్కూల్‌లో..

బోయినపల్లి/చందుర్తి/తంగళ్లపల్లి/ముస్తాబాద్/వేములవాడఅర్బన్/గంభీరావుపేట/ఎల్లారెడ్డిపేట: స్వాతంత్య్ర సేనాని నేతాజీ సుభాస్ చంద్రబోస్ జయంతి ఉత్సవాలను జిల్లాలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలతో పాటు వివిధ పార్టీల ఆధ్వర్యంలో వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పవర్ కట్

నేడు విద్యుత్ అంతరాయం

వేములవాడరూరల్: వేములవాడ మున్సిపల్ పరిధిలోని అయ్యోరుపల్లి వార్డులో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వేములవాడ సెస్ ఏఈ అనూష తెలిపారు. శివరాత్రి పండుగ సందర్భంగా విద్యుత్‌కు మరమ్మతులు చేయడం వల్ల అంతరాయం ఏర్పడుతుందని ఆమె తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమాచారం

నేడే మండల సర్వసభ్య సమావేశం

చందుర్తి: చందుర్తి మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం ఉదయం 11.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీపీ బైరగోని లావణ్య తెలిపారు. అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అన్ని శాఖ అధికారులు సకాలంలో హాజరై మండల సభను విజయవంతం చేయాలని కోరారు.

కోనరావుపేటలో..

కోనరావుపేట: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య గౌడ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

నియామకం

కాంగ్రెస్ చీకోడు గ్రామ కమిటీ కార్యవర్గం

ముస్తాబాద్: మండలంలోని చీకోడు కాంగ్రెస్ కమిటీ కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నట్లు మండల శాఖ అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి తెలిపారు. గ్రామశాఖ అధ్యక్షుడిగా కొప్పు రమేశ్, ఉపాధ్యక్షుడిగా కరెడ్ల అమరేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎనగందుల శ్రీకాంత్, కార్యదర్శిగా బత్తుల బాలకృష్ణ, కోశాధికారిగా పిట్ల సురేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఇల్లంతకుంట: మండలంలోని తాళ్లపల్లిలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఏఎంసీ చైర్మన్ మామిడి సంజీవ్ ప్రారంభించారు. సంజీవ్ మాట్లాడుతూ రైతులు నాణ్యమైన పత్తిని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. ఏఎంసీ కార్యదర్శి హరినాథ్, సీసీఐ అధికారి భరత్ ఉన్నారు.

రోడ్డు భద్రతపై ప్రజలు చైతన్యవంతులు కావాలి



ఎల్లారెడ్డిపేట: రోడ్డు భద్రతపై ప్రజలు చైతన్యవంతులు కావాల్సినవసరం ఎంతైనా ఉందని, మైనర్లకు వాహనాలిచ్చే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై శేఖర్ అన్నారు. ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కాలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మైనర్లే ఎక్కువగా ప్రమాదాలకు గురయ్యారన్నారు. తల్లిదండ్రులు వారికి వాహనాలు ఇచ్చి ప్రోత్సహించడం సరైంది కాదన్నారు. నంబర్ ప్లేట్‌లేని వాహనదారులు, మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కేసు నమోదు చేస్తామన్నారు. అపరిచిత వ్యక్తులు గ్రామాలలోకి వస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

బాలిక సంరక్షణపై అవగాహన

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్లలోని గణేష్‌నగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో బాలిక సంరక్షణపై సోమవారం అవగాహన కల్పించారు. బాలికల సంరక్షణ, చట్టాలు, భ్రూణ హత్యలు నిరోధించడం తదితర అంశాలపై అంగన్‌వాడీ టీచర్ వింధ్యారాణి అవగాహన కల్పించారు

జనహితకు ఒకే ఒక దరఖాస్తు

వీర్నపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జనహిత కార్యక్రమానికి ఒకే ఒక దరఖాస్తు వచ్చినట్లు ఎమ్మార్వో తాఫజుల్ హుస్సేన్ తెలియజేశారు. ప్రజల సమస్యలు పరిష్కారానికి జనహిత కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే జనహిత కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ప్రవీణ్ కుమార్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

చిత్రకథ



రహదారిపై పైపులైన్ లీకేజీ

సిరిసిల్ల: సిరిసిల్ల రెండో బైపాస్‌రోడ్డు పనులు కొనసాగుతుండగానే ఆ రోడ్డు కింద మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోయింది. రహదారిని ప్రారంభించకముందే ఈ పైపులైన్ లీకేజీ నీటితో గుంత పడింది. నీరు నిరంతరం లీకేజీ కావడంతో తడిగా మారి తారు రోడ్డు పాడయిపోతుంది. మిషన్ భగీరథ అధికారులు స్పందించి లీకేజీని మూసివేయాల్సిన అవసరం ఉంది.

కంటి వెలుగుకు అనూహ్య స్పందన


ఎల్లారెడ్డిపేట: కంటి పరీక్ష చేయించుకుంటున్న సీఐ


బోయినపల్లిలో కంటి పరీక్ష చేస్తున్న టెక్నీషియన్


ముస్తాబాద్: శిబిరానికి వచ్చిన ప్రజలు

ఎల్లారెడ్డిపేట: కంటి వెలుగు పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకొని, అంధత్వ నిర్మూలన కోసం కృషి చేయాలని సీఐ మొగిలి అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో సోమవారం సీఐతో పాటు పోలీసులు కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రవంతి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని కస్బెకట్కూర్ గ్రామ పరిధిలో నేరెళ్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో మెడికల్ ఆఫీసర్ రేఖ, వైద్య సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించారు.

బోయినపల్లి: బోయినపల్లి కంటి వైద్య శిబిరంలో 469 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి కే.రేణుక సోమవారం తెలిపారు. వారిలో 172 మందికి కంటి అద్దాలు అందచేసినట్లు తెలిపారు. మరో 71 మందికి కంటి అద్దాలు ఆర్డర్ చేసినట్లు తెలిపారు. కొదురుపాక, విలాసాగర్ శిబిరాల్లో ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు రేణుప్రియాంక, అనిత పర్యవేక్షిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి రాజసులోచన పాల్గొన్నారు.

ముస్తాబాద్: స్థానిక రైతువేదికలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరానికి సోమవారం జనం భారీగా తరలివచ్చారు. నిత్యం నాలుగు వందల మందికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి గీతాంజలి తెలిపారు. ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకుని, సమాచారం వున్న వారు మాత్రమే శిబిరానికి రావాలని కోరారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం


కళ్లద్దాలు అందజేస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్ వేణు

ఇల్లంతకుంట: మండలంలోని రేపాక గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు సోమవారం ప్రారంభించి, కంటి పరీక్షలనంతరం కళ్లద్దాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రొండ్ల లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ రొండ్ల తిరుపతిరెడ్డి, ఉపసర్పంచ్ అనీల్, ఎంపీఓ మీర్జా, వైద్యాధికారి శరణ్య తదితరులున్నారు.

నేడు వస్త్రపరిశ్రమ బంద్

- విద్యుత్ బాదుడుపై నిరసన
- సీపీఐ పట్టణ ప్రధాన కార్యదర్శి రవి



మాట్లాడుతున్న పంతం రవి

సిరిసిల్లటౌన్: విద్యుత్ రెగ్యులరేటరీ కమిషన్ చర్యలకు నిరసనగా మంగళవారం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ బంద్‌కు పిలుపునిస్తున్నట్లు సీపీఐ పార్టీ అనుబంధం లాల్‌బావుటా చేనేత, పవర్‌లూమ్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పంతం రవి తెలిపారు. సిరిసిల్లలోని పార్టీ కార్యాలయంలో సోమవరం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. విద్యుత్‌వినియోగదారులపై మోపుతున్న అదనపు భారం సరికాదన్నారు. ఇది పరిశ్రమలోని కార్మికులు మొదలుకుని అన్ని వర్గాల వారిపై తీవ్ర పరిణామం చూపుతుందన్నారు. బంద్‌లో పరిశ్రమకు చెందిన అన్నివర్గాలు పాల్గొనాలని కోరారు. సామల మల్లేశం, నల్ల చంద్రమౌళి, లక్ష్మీనారాయణ, రమేశ్, నాగరాజు, వేణు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండలం మంత్రి కేటీఆర్ దత్తత తీసుకున్న రాజన్నపేటలో సర్పంచ్ ముక్క శంకర్ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఎంతోమంది పేదలు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా లబ్ధిపొందారని ఆన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకటరమణారెడ్డి, పాల్గొన్నారు.

కోనరావుపేటలో..

కోనరావుపేట: మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన బుర్ర మల్లవ్వకు రూ.20 వేలు, మారు అంజిరెడ్డికి రూ.20 వేలు, గుమ్మడి కమలాకర్‌కు రూ.16 వేలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సర్పంచ్ కొక్కుల భారత, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య అందజేశారు. ఏఎంసీ చైర్మన్ ప్రభాకర్‌రావు, జవ్వాజి రవీందర్‌గౌడ్, మల్లయ్య, కొక్కుల నర్సయ్య, కాయితి సత్తయ్య, సత్యనారాయణరావు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లను వాడొద్దు

ఇల్లంతకుంట: మండలంలోని అన్ని గ్రామాల్లోని కిరాణ షాపుల్లో ప్లాస్టిక్ కవర్లను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీవో మీర్జా అన్నారు. మండలంలోని రేపాక గ్రామంలో కిరాణ దుకాణాల్లో తనిఖీ నిర్వహించారు. పాలిథిన్ కవర్లను వాడొద్దని, రోడ్లపై ప్లాస్టిక్ కవర్లు వేయొద్దన్నారు.

పరామర్శ

చందుర్తి: అనారోగ్యంతో మృతిచెందిన మండలం మర్రిగడ్డ గ్రామానికి చెందిన ఎగుమామిడి సత్తమ్మ కుటుంబ సభ్యులను వేములవాడ ఏఎంసీ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. ఆయనతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు దారం బాల్‌రెడ్డి, కత్తి రాజు, బొడిగే అనిల్‌గౌడ్ పాల్గొన్నారు.